క్లుప్తంగా

ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు


మాట్లాడుతున్న వేములవాడ డిపో మేనేజర్ శ్రీనివాస్

వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న ఆలయానికి ఆర్టీసీ బస్సులో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వేములవాడ డిపో నుంచి ఆర్టీసీ బస్సులు అన్ని రూట్లలో నడుస్తున్నాయన్నారు. విద్యార్థులకు అనుకూలంగా బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమన్నారు.

'జూకంటి'కి సన్మానం

సిరిసిల్లటౌన్: దాశరథి పురస్కార గ్రహీత సిరిసిల్లకు చెందిన 'జూకంటి జగన్నాథం'ను జిల్లా ప్రజా సమీకృత సేవా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యుదయ కవి జగన్నాథంను గుర్తించడం హర్షణీయమన్నారు. కమిటీ అధ్యక్షుడు రవివర్మ, సత్యం, రమేశ్, నాంపెల్లి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

1839 మందికి రుణమాఫీ


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

బోయినపల్లి: మండలకేంద్రంలోని రైతువేదిక భవనంలో రైతు రుణమాఫీ పథకంపై ఎంఏవో కే. ప్రణీత, యూనియన్ బ్యాంక్ మేనేజర్ జీడిపెల్లి మహేందర్ ఆధ్వర్యంలో మంగళవారం మండలస్థాయి గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఏవో ప్రణీత మాట్లాడుతూ మండలంలో 1839 మంది రైతులకు రుణమాఫీ జరిగినట్లు తెలిపారు. రుణమాఫీపై ఏమైనా సందేహాలుంటే గ్రీవెన్స్ సెల్‌లో సంప్రదించాలని కోరారు. రుణమాఫీ కాని రైతులు ఆధార్, పట్టాదార్ పాస్‌బుక్, రేషన్‌కార్డు (ఉంటే), బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తులకు నేడు చివరి రోజు

తంగళ్లపల్లి: మండలంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జనరల్ డిగ్రీ ప్రవేశాలకు బుధవారం చివరి రోజు అని కళాశాల ప్రిన్సిపాల్ రజని ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను సీబీసీఎస్ విధానంలో ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్, బీకాం సీఏ, బీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు అందించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9182351238 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అధికారుల బదిలీ

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు అధికారులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్త అధికారులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీవో జోగం రాజు స్థానంలో మిర్జా అఫ్జల్ అహ్మద్ బేగ్, సూపరింటెండెంట్ విజయేందర్ రెడ్డి స్థానంలో డి.రమేశ్, ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులో ఎస్.పి.రాధాకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ ఫయాజ్ స్థానంలో ఎండీ.సద్దామ్ హుస్సేన్ , ఖాళీ ఉన్న టైపిస్ట్ పోస్టులో ఎల్.రాజు, అటెండర్‌గా డి.శ్రీనివాస్ విధుల్లో చేరారు.

బోయినపల్లి: మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు తెలిసింది. బోయినపల్లి జీపీ కార్యదర్శి రాజసులోచన కరీంనగర్ జిల్లాకు, బూర్గుపల్లి పంచాయతీ కార్యదర్శి మారుతి చందుర్తి మండలం జోగాపూర్‌కు, స్తంభంపల్లి పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ రుద్రంగి మండలం దేనావత్ తండాకు బదిలీ అయినట్లు సమాచారం. రామన్నపేట పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ బూర్గుపల్లికి, వెంకట్రావుపల్లి పంచాయతీ కార్యదర్శి షబానా రామన్నపేటకు, వేములవాడ రూరల్ మండలానికి చెందిన ఐలయ్య వెంకట్రావుపల్లికి బదిలీ అయినట్లు తెలిసింది. ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఆరిఫ్ సిరిసిల్ల జిల్లా కేంద్రానికి, వేములవాడ అర్బన్ ఎంపీవో శ్రీధర్ బోయినపల్లి ఎంపీవోగా బదిలీ అయినట్లు సమాచారం.

రుణమాఫీపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం


మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం రుణమాఫీని పక్కాగా అమలు చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మొదటి విడతలో రూ.లక్ష వరకు రుణాన్ని మాఫీ చేసినట్లు తెలిపారు. రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు రైతులను తప్పుడు ప్రచారంతో అయోమయానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, బండారి బాల్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మండల పరిషత్ కాంపౌండ్‌లోని పార్కు


రాజన్న గుడి చెరువుపై బండ్ పార్కు

ఆహ్లాదం.. మరింత అందంగా..

- పట్టణం నలుమూలలా పార్కుల ఏర్పాటు
- చివరిదశలో పనులు
- హర్షం వ్యక్తంచేస్తున్న పట్టణ ప్రజలు

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు, పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు చేపట్టిన పార్కుల పనులు చివరిదశకు చేరుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు నిత్యం వస్తుంటారు. భక్తులు, వేములవాడ పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం పట్టణంలోని నలుమూలల పార్కులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రెండు పార్కులు పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకొచ్చారు. మరో రెండు పార్కులు పనులు చివరిదశకు చేరుకున్నాయి.


మండల పరిషత్ కాంపౌండ్‌లోని పార్కులో శివుడి విగ్రహం

అందుబాటులో రెండు పార్కులు

వేములవాడలోని మూలవాగుకు ఇరువైపులా ట్యాంక్‌బండ్ పార్కులను పూర్తిచేసి గతేడాది ప్రారంభించారు. ఆ పార్కుల్లోకి పట్టణ ప్రజలు ఆహ్లాదం కోసం నిత్యం వెళ్తున్నారు. ఆ పార్కుతో మూలవాగు బండ్ అందంగా కనిపిస్తోంది. వేములవాడలో ఆ రెండు పార్కులు మాత్రమే ఉండడంతో చిన్నారులు అక్కడికి వెళ్లి ఆడుకుంటున్నారు.

ఆకర్షణీయంగా గుడిచెరువు బండ్

వేములవాడ రాజన్న గుడిచెరువు బండ్‌పై సుమారు 600 మీటర్ల దూరం బండ్ సుందరీకరణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. ఈ పనులకు వీటీడీఏ నిధులు రూ.12కోట్లతో చేస్తున్నారు. ఈ బండ్ పనులను రాష్ట్ర పర్యాటకశాఖ అధికారుల పర్యవేక్షణలో నడుస్తున్నాయి. ఈ బండ్‌పై పార్కు, గార్డెన్, విద్యుత్ దీపాల అలంకరణ, బండ్‌కు రెండువైపులా రెయిలింగ్, వాటర్ ఫౌంటేన్, శివుడి విగ్రహం, వాకింగ్‌ట్రాక్, సిమెంట్ బెంచీలు వివిధ రకాల నిర్మాణాలు చేయనున్నారు. ఈ పనులు మరో 20 రోజుల్లో పూర్తికానున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఈ పార్కు పనులు పూర్తయితే రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు అందుబాటులో ఉంటుంది.

మండల పరిషత్ ఆవరణలో..

వేములవాడ మండల పరిషత్ కాంపౌండ్ ఆవరణలో సుమారు ఎకరం స్థలంలో పార్కు పనులు చివరిదశకు చేరుకున్నాయి. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ) నిధులు రూ.2కోట్లతో జరుగుతున్న పనులు చివరి దశకు చేరాయి. ఈ పార్కులో గార్డెన్, బొమ్మలు, బెంచీలు, వాటర్ ఫౌంటేన్, వాకింగ్‌ట్రాక్, బటర్ ఫ్లై ఆకారంలో విద్యుత్ దీపాలు, జంతువుల ఫొటోలు, పార్కు మధ్యలో శంఖంపై శివుడు కూర్చున్న విగ్రహం, చిన్నారులు ఆడుకునేందుకు జారుడుబండ ఉండటంతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పార్కులు అందంగా ఉన్నాయి



వేములవాడ పట్టణంలో గతంలో అసలు పార్కులు లేకుండా ఉండేవి. గతేడాది మూలవాగు పక్కన రెండు పార్కులు ఏర్పాటు చేశారు. చాలా ఆహ్లాదకరంగా ఉన్నాయి. ఆదివారం వస్తే పెద్దసంఖ్యలో పిల్లలు పార్కులోనే కనిపిస్తున్నారు.

– పాటి కరుణాకర్, వేములవాడ

పట్టణంతో పాటు పల్లె ప్రజలు



మండల ప్రజాపరిషత్ కాంపౌండ్‌లో నూతనంగా చేస్తున్న పార్కు బాగుంది. పట్టణ ప్రజలతోపాటు మండలంలోని గ్రామాల ప్రజలు కూడా వస్తుంటారు. మండల పరిషత్ ఆవరణలో వివిధ కార్యాలయాలు ఉన్నందున పల్లెల నుంచి ఎక్కువగా వస్తుంటారు.

– రొండి లక్ష్మణ్, నాగయ్యపల్లి

చివరిదశకు పనులు



వేములవాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయం కాంపౌండ్‌లో నిర్మాణంలో ఉన్న పార్కు పనులు చివరిదశకు చేరాయి. వివిధ రకాల విగ్రహాలకు పెయింటింగ్, వివిధ పనులు చేస్తున్నారు. పనులు త్వరలోనే పూర్తిచేసి పార్కును ప్రారంభిస్తాం.

– అన్వేశ్, వేములవాడ మున్సిపల్ కమిషనర్

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి


మొక్క నాటుతున్న డీఏవో భాస్కర్

కోనరావుపేట: ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని నిజామాబాద్ రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పత్తిలో చీడపీడల నివారణపై హైదరాబాద్ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటి, వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. ఏవో వెంకట్రామమ్మ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

కేటీఆర్ ముందస్తు జన్మదిన వేడుకలు



ముస్తాబాద్: బీఆర్ఎస్ యూత్ విభాగం ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలను ముందస్తుగా మంగళవారం నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ ప్రజా నాయకుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేటీఆర్ యువసేన అధ్యక్షుడు మెంగని మనోహర్, మండలశాఖ అధ్యక్షుడు శీలం స్వామి, నర్సింలు, జహంగీర్, నారాయణ, అనిల్, దిలీప్, మల్లారెడ్డి, కోడె శ్రీను, శంకర్, శ్రీను,భరత్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• 'మధ్యాహ్న' కార్మికులకు సెలవు ఇవ్వండి

సిరిసిల్లటౌన్: మధ్యాహ్న భోజన కార్మికులు ఆగస్టు 1న విధులకు హాజరుకారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం సిరిసిల్ల ఎంఈవో ఆఫీసులో వినతిపత్రం అందించి మాట్లాడారు. కార్మికుల సమస్యల సాధనకు ఆగస్టు1న చలో హైదరాబాద్ కార్యక్రమం నేపథ్యంలో ఆరోజు మధ్యాహ్న భోజనం వడ్డించరని, ఇందుకు అధికారులు సమ్మతించాలని ముందస్తుగా కోరినట్లు తెలిపారు. ఆయన వెంట లక్ష్మణ్ ఉన్నారు.

• పెండింగ్ బకాయిలు చెల్లించాలి

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు బకాయిలు చెల్లించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 5వరకు చెల్లించాలని లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు మట్టె శ్రీనివాస్, వెంకటేశ్, సుజిత్, వావిలాల సాయి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో నిర్వహించిన ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. వస్త్ర పరిశ్రమ, అనుబంధ రంగాల జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. నాయకులు సోమిశెట్టి దశరథం, కడారి రాములు, సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్, అంగూరి రంజిత్, మంగళి చంద్రమౌళి, రాజశేఖర్, మురళి, బాలరాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

• విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

ఎల్లారెడ్డిపేట: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కల్యాణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కళాశాలల్లో డెస్క్‌లు, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణాలు చేపడుతూ హాస్టళ్లలో మెనూ ప్రకారం భోజనం అందించాలని కోరారు.

• రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కోనరావుపేట: రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రామమ్మ కోరారు. పట్టాదారు పాస్‌బుక్ ఉండి, 18–59 ఏళ్లలోపు వయసు గల రైతులు 2024 రైతుబీమా నమోదుకు అర్హులన్నారు. ఇదివరకు బీమా పథకంలో చేరిన లబ్ధిదారులు ఏమైనా మార్పులుంటే ఈనెల 30లోపు సవరణ చేసుకోవచ్చన్నారు. రైతుబీమాకు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ అందించాలన్నారు.

• హామీలు నెరవేర్చాలి

ఎల్లారెడ్డిపేట: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, గ్రూప్–1, గ్రూప్–2 పోస్టులకు పరీక్షలు నిర్వహించాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి కోరారు. మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేసి మాట్లాడారు. నిరుద్యోగులకు రూ.4వేల నిరుద్యోగ భృతి చెల్లించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, లేకుంటే బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రామచంద్రంకు వినతిపత్రం అందించారు. నేషనల్ ఆఫీస్ సబార్డినేటర్ అనూష్, నాయకులు బాలకిషన్, సురేశ్, ఎలేందర్, చందు, ప్రకాశ్, చరణ్, నవీన్‌నాయక్, పవన్ పాల్గొన్నారు.

• కోనరావుపేట ఎంపీవోగా అరీఫ్ పాషా

కోనరావుపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవోగా ఎండీ.అరీఫ్ పాషా బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన మీర్జా బదిలీపై వెళ్లగా, ఇల్లంతకుంటలో పనిచేస్తున్న అరీఫ్‌ను కోనరావుపేటకు బదిలీచేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

• చైతన్యగౌడ్‌కు అభినందన

వేములవాడఅర్బన్: పట్టణానికి చెందిన వీరగోని చైతన్యగౌడ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టాను సాధించినట్లు తెలిపారు. చైతన్య గౌడ్ చందుర్తి మండలం ఎన్గల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వేములవాడ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల మల్లారెడ్డి, అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు చైతన్యగౌడ్‌కు అభినందనలు తెలిపారు.

వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బదిలీ

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు బదిలీ అయ్యారు. ఆస్పత్రి వైద్యులు అనస్తీసియా వైద్యుడు తిరుపతి కరీంనగర్‌కు, గర్భిణీ వైద్య నిపుణురాలు స్వాతి జగిత్యాలకు, వైద్యురాలు రాజశ్రీ బదిలీ అయ్యారు. సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు ఫ్యామిలీ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఆర్ఎంవో డాక్టర్ సంతోష్‌చారి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.

రాజన్న వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో బోనాలు



వేములవాడ: పట్టణంలోని బద్దిపోచమ్మవీధికి చెందిన శ్రీరాజరాజేశ్వర వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బద్దిపోచమ్మకు బోనం, రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఆషాఢమాసంలో వ్యాపారులంతా మొక్కులు చెల్లిస్తామని సంఘం అధ్యక్షుడు పిన్నింటి హన్మండ్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడు ఎల్ల పోశెట్టి, ప్రధాన కార్యదర్శి కూస హరీశ్, ఉపాధ్యక్షులు కూర దేవయ్య, ముద్రకోల లింబాద్రి, కోశాధికారి నక్క వేణు, ఆడెపు శ్రీనివాస్, మంత్రి రమేశ్, గంప రాజు, బొడ్ల రమేశ్, చాడ రాజేశ్, జ్ఞానేశ్వర్, నవీన్, వ్యాస్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కోనరావుపేట: ప్రభుత్వం రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. మరిమడ్లలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కొమ్ము బాబు, జింక శ్రీనివాస్, కడకుంట్ల శంకర్, గణేశ్, తీగల రామచంద్రం, సింగం నారాయణ, పుల్కం మల్లేశం, రాజ మల్లేశం, కోల పెద్ద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రుద్రంగి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆర్‌బీఎస్‌కే వైద్యులు ప్రభాకర్, అభినయ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు.

బదిలీలు ఆపాలని వినతి


ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వేములవాడ: రాజన్న ఆలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నిలుపుదల చేసేలా కృషి చేయాలని పేర్కొంటూ ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు సిరిగిరి శ్రీరాములు నేతృత్వంలో మంగళవారం ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, రాంచందునాయక్, బీర్ల ఐలయ్యను కలిసి వేడుకున్నారు. ఆలయ ఉద్యోగుల బదిలీలు చేయొద్దని, ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు నటరాజ్, మహేశ్, గుండి నర్సింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్లు ఎడ్ల శివ, సురేశ్, రాజేందర్, నక్క తిరుపతి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషిచేయాలి



ముస్తాబాద్: కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను అర్హులకు అందించాలని కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ కోరారు. జిల్లా కార్మికశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మహ్మద్ నజీర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో వలస కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందించినట్లు తెలిపారు. కార్మికులకు ప్రమాదబీమా, మృతిచెందితే సంస్థ నుంచి పరిహారం వంటి వాటిపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కావటి మహిపాల్, జంగ రాజు,బొబ్బిలి రాజశేఖర్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత


వేములవాడరూరల్: చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ: ప్రభుత్వవిప్ చొరవతో 33 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేశ్, నాయకులు చిలుక రమేశ్, తూం మధు, వంగల శ్రీనివాస్, పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లి, నమిలిగుండుపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. నమిలిగుండుపల్లికి చెందిన గడిపల్లి మనీషకు, లింగంపల్లికి చెందిన ఆకుల శారద, లింగంపల్లి రాజుకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్ గౌడ్, నాయకులు సామ తిరుపతిరెడ్డి, వంగపల్లి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన అలకుంట్ల స్వామికి రూ.60వేలు, దొబ్బల రత్నమ్మకు రూ. 25,500 సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను డీసీసీ కార్యదర్శి కచ్చకాయల ఎల్లయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు నీరటి సంజీవ్ అందజేశారు. పల్లిమక్తలో కోరవేని సంధ్యకు రూ.12వేల చెక్కు అందించారు. సుంకరి రెడ్డి, బాల్‌రెడ్డి, నీరటి సురేశ్, తదితరులు పాల్గొన్నారు

కొదురుపాకలో రైతునేస్తం

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక రైతువేదిక భవనంలో రైతునేస్తంలో భాగంగా శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. పత్తి పంటలో చీడపీడల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి రైతులకు వివరించారు.

ఫోన్ అప్పగింత

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన మ్యాకల వెంకటేశ్ ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఫోన్‌ను గుర్తించి సోమవారం రాత్రి ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఫోన్ అప్పగించారు.

ఘనంగా బోనాలు



గంభీరావుపేట/తంగళ్లపల్లి: మండలకేంద్రంలో మహంకాళి అమ్మవారి బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం పూసల సంఘం మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తంగళ్లపల్లి మండలకేంద్రంలోని కట్టమైసమ్మ తల్లికి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నట్లు పేర్కొన్నారు.

చండీయాగానికి రండి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రం అందిస్తున్న పద్మశాలీ నేతలు

సిరిసిల్ల కల్చరల్: వస్త్ర పరిశ్రమ సంక్షోభం తొలగిపోయి కార్మికుల కష్టాలు తొలగిపోవడంతోపాటు లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న శ్రీ చండీ మహాయాగానికి రావాల్సిందిగా రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పట్టణ పద్మశాలీ సంఘం నేతలు ఆహ్వానించారు. హైదరాబాద్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 28 నుంచి శివ భక్త మార్కండేయ ఆలయ ప్రాంగణంలో నిర్వహించే యాగానికి రావాల్సిందిగా కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. యాగానికి హాజరవుతానని హామీ ఇచ్చినట్లు పద్మశాలీ సంఘం పట్టణాధ్యక్షుడు గోలి వెంకటరమణ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నేతలు మండల సత్యం, గాజుల బాలయ్య, సంగీతం శ్రీనివాస్, పద్మశాలీ కల్యాణ భవన సంఘం అధ్యక్షుడు గుండ్లపెల్లి శ్రీనివాస్, గుంటుక మహేశ్ తదితరులు ఉన్నారు.

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు సరికాదు


మాట్లాడుతున్న లత

సిరిసిల్లటౌన్: ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ తమ మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఊరగొండ లత అన్నారు. మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగులకు రిజర్వేషన్ల ఆవశ్యకతపై ఆమెకు కనీస అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేశారని, తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈవిషయమై రాష్ట్ర ప్రభుత్వం ఆమెపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జువ్వాది అమర్నాథ్, బియ్యంకార్ శ్రీనివాస్, బోగ రాజయ్య, వెల్ది గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899